

అంజనికుమారిని సన్మానిస్తున్న నిర్వాహకులు, అతిథులు

అంజనికుమారికి సావిత్రీ బాయి పూలే పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సామాజికవేత్త, సిటీ సివిల్‌కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనికుమారిని సావిత్రీ బాయి పూలే పురస్కారం అందుకున్నారు. దీన్ని వావ్ మ్యూజిక్ అకాడమీ, యువతేజం ట్రస్ట్, కలాం విజన్ సంస్థల ఆధ్వర్యంలో అందజేశారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కళాభారతి, సిటీకల్చరల్ సెంటర్‌లో మంగళవారం జాతీయ పురస్కారాల ప్రదానం, సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అదనపు డీసీపీ తేజావత్ రామ్‌దాస్ మాట్లాడుతూ అర్హులకు పురస్కారాలు అందజేస్తే వాటి విలువ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కరీముల్లా, పీవీ లక్ష్మి, రాధాకుసుమ, కేశవరాజు వెంకట ప్రభాకర్‌రావు, రమణారెడ్డి వినయ్‌కుమార్, శ్రీనివాస్, అనురాధ, భారతి, శశిరేఖ, పద్మ, సావిత్రి, భాగ్యలక్ష్మి, మురళి, రణధీర్, రవి, సుబ్రహ్మణ్యం, నాయకుడు అమృతవల్లి, రాజారాణి, సుజాతకుమారి, సుధారాణి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికే 'బస్తీబాట'

● విద్యుత్ శాఖ డీఈ కమల్‌కుమార్

ముషీరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా నెలకొన్న విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ అజామాబాద్ డివిజన్ ఆపరేషన్స్ డీఈ కమల్ కుమార్ తెలిపారు. మంగళవారం విద్యుత్ శాఖ బస్తీబాట కార్యక్రమంలో భాగంగా పార్శీగుట్ట, జెమిని కాలనీ, బ్రహ్మంగారి దేవాలయం వీధులలో విద్యుత్ శాఖ అధికారులు పర్యటించారు. అజామాబాద్ సెక్షన్ పరిధిలో స్థానిక సమస్యలైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతులు, జనావాసాలకు ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలు, వేళాడుతున్నవి వెంటనే సరిచేయడంతో పాటు క్షేత్రస్థాయిలో స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ వినోద్ కుమార్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



పార్శీగుట్ట వద్ద విద్యుత్ తీగలను పరిశీలిస్తున్న అధికారులు ఏఈలు సునీల్ రెడ్డి తదితరులు

శతాధిక వైద్యుడు ఓపి శర్మ కన్నుమూత



చిక్కడపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైద్యుడు డా. ఓరుగంటి ఆంజనేయశర్మ(డా. ఓపి శర్మ) (101) అశోక్‌నగర్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఉస్మానియా వైద్యకళాశాల, తిరుపతి వెంకటేశ్వర వైద్యకళాశాల, గుంటూరు వైద్య కళాశాలలో ఉత్తమ సేవలను అందించారు. ఆయన చెస్ట్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. మెడికల్ హెల్త్ సర్వీసెస్ అదనపు సంచాలకుడిగా, ఉస్మానియా మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా కూడా పనిచేశారు. 1983లో రిటైర్ అయ్యాక ఐదు సంవత్సరాలు ఇరాన్, సౌదీ అరేబియా దేశాల్లో వైద్యసేవలు అందించారు. సామాన్యులకు వైద్యసంబంధ భాష అర్థం అయ్యేందుకు పదకోశం డిక్షనరీ (ఇంగ్లీష్ టు తెలుగు) రాశారు. విజ్ఞాన సాహిత్య వినోద అంశాలపై 25కు పైగా పుస్తకాలను ఇంగ్లీష్, తెలుగు భాషల్లో వెలువడ్డాయి. రామకృష్ణామఠం వివేకానంద హెల్త్‌సెంటర్‌లో ఉచిత వైద్యసేవలను కూడా అందించారు. ఆయనకు కుమారులు రవీందర్, రఘుకిషోర్, కుమార్తె వాణిశాస్త్రి ఉన్నారు.

టీడీపీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్ష,ప్రధానకార్యదర్శుల నియామకం




రాజు, శుక్రవేది

రాంనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్ టీడీపీ నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బీ రాజు, ఆర్ఎం శుక్రవేదిలు నియమితులయ్యారు. ఇదే విషయాన్ని పార్టీ దోమలగూడ నగర కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు పీ సాయిబాబా, ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పలుసబాల్‌రాజ్‌గౌడ్‌లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టీడీపీని మరింత పటిష్టానికి డివిజన్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ పూర్వవైభవం తీసుకువచ్చేందుకు సంస్థాగత ఎన్నికలు ఇందుకు దోహదపడతాయని తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షప్రధానకార్యదర్శులు బీ రాజు, ఆర్ఎం శుక్రవేదిలు మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి ఈ పదవులు అప్పగించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్‌కుమార్ గౌడ్, బక్క నర్సింహులు. పీ సాయిబాబాలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి : కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్.. బస్తీలు, కాలనీలలో గల ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని రాంనగర్ కార్పొరేటర్ కే.రవిచారి ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. మంగళవారం రాంనగర్ డివిజన్ జెమిని కాలనీలో ట్రాన్స్‌కో ఏడీఈ వినోద్, ఏఈ, ఇతర సిబ్బందితో కలిసి ఆయన బస్తీ బాటలో పాల్గొన్నారు. జెమిని కాలనీ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పేరుకుపోయిన మట్టి చెత్త కుప్పలు తొలగించారు. ప్రమాదకరంగా ఉన్న వైర్లను తొలగించి కొత్తవైర్లను ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరగకుండా ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని రవి తెలిపారు. ఇళ్లను తాకే కేబుళ్లను తొలగించాలని కోరారు. బస్తీవాసులు బీజేపీ నేతలు పాల్గొన్నారు.



జెమిని కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త, మట్టి తొలగింపు పనులను పరిశీలిస్తున్న రాంనగర్ కార్పొరేటర్ రవిచారి, ట్రాన్స్‌కో ఏడీఈ వినోద్, ఏఈ తదితరులు

రాష్ట్రబంద్‌కు సహకరించాలి

● 18న వ్యాపారస్తులు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేయాలి

● తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ విజ్ఞప్తి



బర్కత్‌పుర: మాట్లాడుతున్న వేముల రామకృష్ణ



రాంనగర్:మాట్లాడుతున్న అరవింద్‌కుమార్‌గౌడ్, సాయిబాబా

బర్కత్‌పుర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బీసీ జేఏసీ నిర్వహిస్తున్న తెలంగాణ బంద్‌కు వ్యాపారస్తులు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా సహకరించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు కల్పించిన 42శాతం రిజర్వేషన్‌లు కల్పించే జీవో 9పై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈనెల 18న చేపడుతున్నామని, ఈ సందర్భంగా రవాణా శాఖను పూర్తిగా స్తంభింప చేస్తామన్నారు. మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు స్టేకు నిరసనగా ఎంపీ ఆర్ కృష్ణయ్య సారథ్యంలో బీసీ జేఏసీ ఆవిర్భవించిందన్నారు. దీని ఆధ్వర్యంలో ఆరోజు నిర్వహించే బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాలు మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. రాష్ట్ర సాధన ఉద్యమ తరహాలో బీసీ ఉద్యమం చేపడుతున్నామని బీసీ సామాజికవర్గాల వారు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు ప్రవీణ్ కుమార్, జగదీష్, దయాకర్, రాజేష్, బాలు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘాల మద్దతు

బీసీ 42శాతం రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేకు నిరసనగా బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వగా యాదవ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. మంగళవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్, తెలంగాణ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్ యాదవ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ యాదవ్, గ్రేటర్ అధ్యక్షుడు ఎం.మహేందర్ యాదవ్, యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అచ్యుతాయాదవ్, యాదవ న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నోముల సైదులు యాదవ్‌లు మాట్లాడారు. కోర్టు స్టే అంటే బీసీల నోటికాడి ముద్దను లాక్కోవడమేనన్నారు. బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులకు ఈ బంద్ ఒక చెంపపెట్టు అని స్పష్టం చేశారు.

టీడీపీ కూడా..

రాంనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌కు తెలంగాణ టీడీపీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్‌గౌడ్, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పీ సాయిబాబాలు తెలిపారు. మంగళవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కోర్టు స్టే పేరుతో బీసీలను కాంగ్రెస్ మరోసారి మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత స్టే ఇవ్వడం చరిత్రలో లేదని, దీని వెనుక కుట్రకోణం ఉందన్నారు. బీసీలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అవకాశాలు కల్పించి చైతన్యం తీసుకువచ్చిన పార్టీ టీడీపీయేనని అన్నారు. బంద్‌లో టీడీపీ శ్రేణులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పలుసబాల్‌రాజ్ గౌడ్, నల్లెల కిషోర్ ఎస్ ప్రకాష్, శుక్రవేది, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

16, 17వ తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు

బీసీ సంఘాల జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర బంద్‌లో బీసీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని జేఏసీ కో చైర్మన్, బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సంఘ కార్యాలయంలో ఆ మేరకు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈనెల 15, 16 తేదీల్లో చాయితో చర్చ, 17న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహాల వద్ద వినతి పత్రాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సట్ల ప్రభాకర్‌తో పాటు పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభిప్రాయం మేరకే

డీసీసీ అధ్యక్షుడి ఎంపిక

● కేంద్ర మాజీ మంత్రి సీపీ జోషి



మాట్లాడుతున్న సీపీ జోషి

ముషీరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పార్టీ నాయకులు కార్యకర్తల అభిప్రాయం మేరకే డీసీసీ అధ్యక్షుడిని ఎన్నుకుంటామని కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడి నియామక పరిశీలకుడు, కేంద్ర మాజీ మంత్రి సీపీ జోషి సూచించారు. కష్టపడి పనిచేసేవారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని, జిల్లా అధ్యక్షుడి ఎంపికలో ఎలాంటి తారతమ్యాలు లేకుండా పార్టీని బలోపేతం చేసేవారికే పదవిలో నియమిస్తామన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో సంఘటన్ సృజన్ అభియాన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడి ఎంపిక కోసం ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఏ అండ్ బి బ్లాక్ కమిటీల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోలింగ్ బూత్ స్థాయి నుంచి కష్టపడి పనిచేసే వారే భవిష్యత్‌లో ఉన్నత పదవులు అధిరోహిస్తారని పేర్కొన్నారు. యువత, మహిళలు అన్ని వర్గాల ప్రజలను పార్టీకి చేరువయ్యేలా నాయకులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టాలంటే కిందిస్థాయి నాయకులు క్రమశిక్షణతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడి ఎంపిక కోసం పార్టీ నాయకుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. సమావేశంలో ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, సమావేశం కోఆర్డినేటర్ పవన్, ఏ అండ్ బి బ్లాక్ కమిటీ అధ్యక్షుడు వి.డి కృష్ణ, అంజియాదవ్, యూత్ కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు సంఘపాక వెంకట్, మాజీ కార్పొరేటర్లు వాజీద్ హుస్సేన్, కల్పన యాదవ్, డివిజన్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, నియోజకవర్గం ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నరేందర్ దరఖాస్తు

కేంద్ర మాజీ మంత్రి సీపీ జోషికి సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడి పదవికి గాను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరేందర్ దరఖాస్తు అందజేశారు. హైదరాబాద్‌లోని మూడు జిల్లాలలో ఏదైనా ఒక జిల్లాను దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి ఈ పదవి ఇవ్వాలని కోరారు. అలాగే క్రమశిక్షణతో పనిచేసే వారికే డీసీసీ పగ్గాలు అప్పజెప్పాలని పార్టీ సీనియర్ నాయకుడు తేజా గౌడ్ కూడా పత్రం అందజేశారు. గోల్కొండ హోటల్‌లో ఆయనను కలిసి ఈ పదవి విషయంపై నాయకులతో కలిసి తేజాగౌడ్ అభిప్రాయాలను వెల్లడించారు.



మాట్లాడుతున్న కృష్ణ స్వరూప్ తదితరులు

బౌద్ధ ధర్మంతోనే దళితులకు తాత్విక విముక్తి

● పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

కవాడిగూడ , అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజన సమాజానికి బౌద్ధధర్మంతోనే తాత్విక విముక్తి లభిస్తుందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పేర్కొన్నారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బౌద్ధ ధర్మ దీక్ష దివస్‌ను పురస్కరించుకొని ప్రదర్శన నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ 1956 అక్టోబరు 14న బౌద్ధధర్మాన్ని మహారాష్ట్ర నాగ్‌పూర్‌దీక్ష మైదానంలో స్వీకరించారని గుర్తు చేశారు. స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం కరుణ, ప్రేమ మానవీయత, బౌద్ధమతంతోనే సాధ్యమని ఆయన గ్రహించారని తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జేఎన్ రావు, జాతీయ ప్రధాన కార్యదర్శి సంకు శ్రీనివాసులు దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇటికాల గణేష్, నాయకులు నరసింహచారి, మద్దెల రాయప్ప, చందు, సూర్య కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ జూనియర్ కాలేజీలో నిర్వహించిన టెన్నిస్ టోర్నీలో బాలుర సింగిల్స్ టైటిల్‌ను కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడాకారుడు జె. సిద్ధార్థ గెలిచాడు. క్రీడాకారుడికి మంగళవారం రాష్ట్ర జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి. లక్ష్మయ్య అభినందించారు.

-(బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి)

ఉద్యోగాలను సృష్టించే వ్యక్తులుగా మారాలి



ఇల్యూమినేట్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

రాంనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల కోసం కాకుండా విద్యార్థులు ఉద్యోగాలను సృష్టించే వ్యక్తులుగా మారాలని అరోరా డిగ్రీ అండ్ పీజీ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇల్యూమినేట్ వర్క్‌షాప్- 2025 మంగళవారం నిర్వహించారు. అరోరా డిగ్రీ అండ్ పీజీ కాలేజీ ఆధ్వర్యంలో ఐఐటీ ముంబయి, ఓటీబీఐ సహకారంతో ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని కళాశాల ఆవరణలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్, ఓటీబీఐ డైరెక్టర్ విద్యాసాగర్, రీసెర్చ్ అడ్వయిజర్ డాక్టర్ నారాయణలు మాట్లాడుతూ విద్యార్థులు వ్యాపార ఆలోచనను పెంపొందించుకోవాలని సూచించారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు వారు కృషి చేయాలన్నారు. డాక్టర్ సిద్ధార్థ, డాక్టర్ జీడీ రజనీలు మాట్లాడుతూ నూతన ఇన్నోవేషన్‌లు, స్టార్టప్‌ల కోసం ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



కాచిగూడ డివిజన్ కుద్బిగూడ గణేష్ దేవాలయం వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ తదితరులు సిబ్బందితో పూడ్చివేయించారు. (బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి)

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ దుర్మరణం

బర్కత్‌పుర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం .. 55 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని మహిళ ఫలక్‌నూమా - శివరాంపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు ప్రయాణికురాలి బ్యాగ్ చోరీ

రైలు ప్రయాణికురాలి బ్యాగును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... కడపకు చెందిన ఆలూరు లక్ష్మి(47) తిరుపతి - చర్లపల్లి స్పెషల్ రైల్‌లో నగరానికి వస్తోంది. వనపర్తి వద్ద ఆమె హ్యాండ్‌బ్యాగ్‌ను దొంగలు చోరీ చేశారు. ఇందులో 30 గ్రాముల బంగారు ఆభరణాలు, 20 వేల రూపాయల నగదు, ఆధార్ కార్డు ఉంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పీఎస్‌కు కేసు బదిలీ చేసినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

ఇంకా లభించని దినేష్ ఆచూకీ

● నాలాలో కొట్టుకుపోయి నెలరోజులైందని భార్య రాజమణి ఆవేదన

ముషీరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ వినోభానగర్ వాసి స్థానికుడు దినేష్ ప్రమాదవశాత్తు సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షానికి నాలాలో పడి కొట్టుకుపోయి మంగళవారానికి నెల రోజులైందని భార్య రాజమణి ఆవేదన వ్యక్తం చేసింది. నేటికీ భర్త ఆచూకీ లభించడం లేదని తెలిపింది. హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు పలు మార్లు నాలాలోకి దిగి వెతికారని పేర్కొంది. కుమారుడు కార్తికేయ తండ్రి కోసం అడుగుతున్నాడని, రోజూ రాత్రి సమయాల్లో ఏడుస్తున్నాడని తెలిపింది. భర్త ఆచూకీ తెలుసుకోవాలని అధికారులను ఆమె కోరుతోంది.

పెట్రోల్ గోల్‌మాల్‌పై నిలదీత

● వ్యక్తిపై బంకు యజమాని, మరొకరు దాడికి విఫలయత్నం



పెట్రోల్ బాటిల్‌తో బాధితుడు కృష్ణ

అంబర్‌పేట, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ తగ్గించి పోశారు ఏమిటని ప్రశ్నించిన ఓ వ్యక్తిపై బంకు యజమాని, పనిచేసే వ్యక్తి దాడికి యత్నించారు. ఈ సంఘటన అంబర్‌పేటలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికుడైన కృష్ణ అనే వ్యక్తి మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో అంబర్‌పేట అలీ కేఫ్ చౌరస్తాలోని భారత్ పెట్రోల్ బంక్‌కు వెళ్లి బైక్‌లో రూ.100, ప్లాస్టిక్ బాటిల్‌లో మరొక రూ. 100లకు పెట్రోల్ పోయమన్నాడు. బాటిల్‌లో పెట్రోల్ తగ్గించి కొట్టడాన్ని గమనించాడు. ఇదే విషయమై సదరు పెట్రోల్ పోసిన వ్యక్తిని ప్రశ్నించాడు. ఇంతలో బంకు యజమాని అక్కడికి రాగా అతనికి కూడా ఈ విషయం చెప్పాడు. కాని వారిద్దరూ కలిసి కృష్ణపై దాడికి విఫలయత్నం చేశారు. ఈ బంక్‌లో నిత్యం పెట్రోల్ సక్రమంగా పోయడం లేదని, అధికారులు వెంటనే దీనిపై దాడులు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కృష్ణ కోరుతున్నారు.

ఔషధ తయారీ యూనిట్లలో తనిఖీలు తప్పనిసరి

● డాక్టర్ దివ్య చందన



రాంనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల దగ్గు సిరప్ ఔషధ తయారీ యూనిట్లను పర్యవేక్షించేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని మిషన్ మోదీ రాష్ట్రీయ సంఘ్ తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, పారిశుధ్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ దివ్య చందన పేర్కొన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల దేశంలోని పలు ప్రాంతాలలో కలుషిత దగ్గు సిరప్ తాగిన పిల్లలు మరణించిన ఘటన తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. ఈ పరిస్థితి చాలా బాధాకరమైందని అన్నారు. ఇథిలీన్ గ్లైకాల్ వంటి ప్రమాదకర రసాయనాల వినియోగంపై ప్రమాణాలు నిర్ధారించి వాటి వాడకంపై కఠిన నియంత్రణ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పిల్లలకు ఔషధం ఇచ్చే ముందు తప్పనిసరిగా తల్లిదండ్రులు.. వైద్యులను సంప్రదించాలని సూచించారు.